# స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

- పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వద్దు
- దివ్యాంగుల కోసం ర్యాంపులు, ట్రైసైకిళ్లు ఏర్పాటు
- పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్ ఖాన్
- పెద్దపల్లి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ తనిఖీ



పెద్దపల్లిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, నవంబర్ 29: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పెద్దపల్లి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజామ్మిల్‌ఖాన్ పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో పోలింగ్ పకడ్బందీ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. బుధవారం ఆయన పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకుడు శ్రీధరతో కలసి తనిఖీ చేశారు. పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్, అమర్‌చంద్ కల్యాణమండపం సమీపంలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిర్వహణకు ఏర్పాట్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పగించాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వుపోలింగ్ సామగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉంచాలని నిర్దేశించారు. సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయోజనులందరూ తప్పనిసరిగా నవంబర్ 30న జరిగే పోలింగ్‌లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు, టాయిలెట్ ఇతర వసతులు కల్పించామని తెలిపారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సీహెచ్ మధుమోహన్, పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను అరటి తోరణాలతో అలంకరించారు. తివాచీలు పరిచారు. జిల్లాలో మహిళా పోలింగ్ కేంద్రాలు 16, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలు 3, మాడల్ పోలింగ్ కేంద్రాలు 13, యూత్ పోలింగ్ కేంద్రాలు 3 ఏర్పాటు చేశారు. పెద్దపల్లి నియోజక వర్గంలో 6, రామగుండం, మంథని నియోజక వర్గంలో 5 చొప్పున మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు నియోజక వర్గానికి ఒకటి చొప్పున, యూత్ పోలింగ్ కేంద్రాలు కూడా నియోజక వర్గానికి ఒకటి ఏర్పాటు చేశారు. పెద్దపల్లి నియోజక వర్గంలో 6, రామగుండం నియోజక వర్గంలో 5, మంథని నియోజకవర్గంలో 2 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



కాల్వశ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ స్టేషన్



ధర్మారంలో ఏర్పాటు చేసిన యూత్ పోలింగ్ స్టేషన్



రామగుండం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ రెమో రాజేశ్వరి

# పోలింగ్‌కు పటిష్ఠ బందోబస్తు

- సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో కేంద్ర బలగాలు
- సీపీ రెమో రాజేశ్వరి

ఫర్టిలైజర్‌సిటీ, నవంబర్ 29: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రశాంతంగా సజావుగా పోలింగ్ నిర్వహణకు పట్టిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని రామగుండం పోలీసు కమిషనర్ రెమో రాజేశ్వరి తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో 3,052 సివిల్ అధికారులు, 16 కంపెనీల కేంద్ర బలగాలు, 1,150 మంది ఇతర రాష్ట్రాల సిబ్బందిని నియమించామని తెలిపారు. కమిషనరేట్‌లోని ఆరు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సెక్టార్ అధికారులు, పోలీసు రూట్ మొబైల్ అధికారులు, ఆర్మ్‌డ్ అధికారులతో పోలింగ్ అధికారులను, పోలింగ్ పరికరాలను పోలింగ్ లోకేషన్లకు కట్టుదిట్టమైన భద్ర త చర్యల మధ్య తీసుకెళ్లామన్నారు. బుధవారం పలు పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లను సందర్శించిన సీపీ సిబ్బందికి భద్రతపై ఆదేశాలు, సూచనలు చేశారు. పెద్దపల్లి జిల్లాలో 1,291మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు ఆరు కేంద్ర బలగాల కంపెనీలు, 500మంది మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెం దిన హోంగార్డ్స్‌ని ఏర్పాటు చేయగా, మంచిర్యాల జిల్లాలో 1,762 మంది అధికారులు సి బ్బంది, 10 కేంద్ర బలగాల కంపెనీలు, 650 మంది ఛత్తీస్‌గఢ్ హోంగార్డ్స్, ఏపీ నుంచి వచ్చిన ఒక పోలీసు టీమ్‌లను పోలింగ్ బందోబస్తుకు వినియోగించినట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సీపీ కార్యాలయంలో 24గంటలు మానిటరింగ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు. 48గంటల పాటు సైలెన్స్ పిరియడ్‌లో అన్ని లాడ్జిలు, ఫంక్షన్‌హాల్స్, గెస్ట్‌హౌజ్‌లను చెక్‌చేసి బయట నుంచి వచ్చిన వ్యక్తులను పంపించామని పేర్కొన్నారు. ఆకస్మిక వాహన తనిఖీలు, ఓటర్లను ప్రభావిత చేసే ప్రజలను ప్రలోభాలకు గురిచేసే డబ్బులు, వస్తువులు పంచకుండా ముందస్తు చర్యలు తీసుకున్నా మన్నారు. సెంటర్ల పరిధిలో గురువారం సా యంత్రం 5గంటల వరకు 144 సెక్షన్ అమ లు చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాలో 2,231 మందిని బైండోవర్ చేశామన్నారు. సరిహద్దు రాష్ట్రాల ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి నిరంతరం నిఘాపెట్టామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన, ఎన్నికల ప్రక్రియకు భంగం కలింగించిన, అల్లర్లు, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.



మంథని జేఎన్టీయూ సెంటర్‌లో భద్రత ఏర్పాట్లపై ఆరా తీస్తూ..

# ఎన్నికల విధుల్లో యంత్రాంగం



పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని స్థానాలకుగాను గురువారం ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుండగా, యంత్రాంగం 838 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి బుధవారం సాయంత్రం సామగ్రి పంపిణీ చేసి, కేంద్రాలకు తరలించింది. వారు కేటాయించిన సెంటర్లకు వెళ్లి సామగ్రిని సరిచూసుకున్నారు.

-పెద్దపల్లి, నవంబర్ 29 నమస్తేతెలంగాణ

